



ఇచ్ఛాపురం : బాహుదా నదిలో పెరిగిన నీటి ప్రవాహం

బాహుదాకు మొదటి ప్రమాద హెచ్చరిక

ఇచ్ఛాపురం/ శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బాహుదానదిలో వరదనీటి ప్రవాహం పెరిగింది. మంగళవారం రాత్రి 51,228 క్యూసెక్కులకు నీటి ప్రవాహం చేరింది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు జలవనరులశాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ తెలిపారు. ఎగువన ఒడిశాలో భగలట్టి రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగటంతో.. గేట్లు ఎత్తి నీరు విడిచిపెట్టారు. దీంతో బాహుదా నదికి భారీ వరద నీరు పెరిగింది. మంగళవారం ఈ నదిని ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ పరిశీలించారు. నదీ తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకటరావు, ఎంపీడీవో ప్రభాకరరావు, సీఐ చిన్నమనాయుడు, ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీ జలదిగ్బంధం



గార : బందరువానిపేటలో పర్యటిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్

రామదాసుపురం చెరువుకు గండి

పొందూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా పొందూరు మండలం కనిమెట్ట పంచాయతీ రామదాసుపురం చెరువుకు గండి పడింది. అధికారులు స్పందించి 200 ఇసుక బస్తాలతో గండి పూడ్చడంతో ప్రమాదం తప్పింది. తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి శ్రీనురెడ్డి గండి పూడ్చే పనులను పరిశీలించారు. అలాగే రెల్లిగెడ్డలో వరదనీటి ప్రవాహం పెరిగింది. లైదాం వద్ద బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో పొందూరు, సంతకవిటి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



పొందూరు : చెరువుకు గండిపూడ్చే పనులను పరిశీలిస్తున్న అధికారులు

రైళ్లు రద్దు

ఆమదాలవలస, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ మీదుగావెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ మంగళవారం రద్దు చేసింది. బరంపురం-విశాఖపట్నం పాసింజర్(58531), భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), బరంపూర్-విశాఖపట్నం(18525), భువనేశ్వర్-సికింద్రాబాద్ (17015), పలాస-విశాఖ ఈయమ్‌యూ పాసింజర్(67290), గుణుపూర్-విశాఖపట్నం పాసింజర్(58505) రైళ్లను రద్దు చేశామని రైల్వే అధికారులు తెలిపారు. ముందస్తు సమాచారం అందడంతో చాలామంది ప్రయాణాలు వాయిదా వేసుకున్నారు. రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు లేక శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ బోసిపోయింది.

ముంచేసిన మొంథా





టెక్కలి రూరల్: జగన్నాథపురంలో నీట మునిగిన వరి

జి.సిగడాం: నాగులవలసలో ఆవేదన చెందుతున్న రైతు

- తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా కుండపోత
- ఉప్పొంగిన నదులు
- వేలాది ఎకరాల్లో ఒరిగిన వరి పంట..
- విద్యుత్ శాఖకు రూ.6లక్షలకుపైగా నష్టం
- నేడు కూడా భారీ వర్షాలు
- హైవేపై రాత్రి నుంచి భారీ వాహనాల నిలుపుదల

శ్రీకాకుళం, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): తీవ్ర తుఫాన్‌గా మారిన 'మొంథా'.. జిల్లాను ముంచేసింది. మంగళవారం వేకువజాము నుంచీ కుండపోతగా వర్షం కురిసింది. సాధారణ ప్రజలకు.. రైతులకు మోస్తరుగా నష్టం మిగిల్చింది. కంచిలిలో అత్యధికంగా 62 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కవిటిలో 56.25 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మెళియాపుట్టిలో 53.0, శ్రీకాకుళంలో 43.75, పలాసలో 42.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 21 మండలాల్లో భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో ఈదురుగాలుల ప్రభావం చూపాయి. భారీ వర్షాలకు నదులు ఉప్పొంగాయి. శ్రీకాకుళం నగరంతోపాటు.. అన్ని గ్రామీణ ప్రాంతాలు.. పంట పొలాలు జలమయమయ్యాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బాహుదానది ఉగ్రరూపం దాల్చడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. నాగావళి, వంశధార నదులు సైతం ఉధృతి పెరిగాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. తీర ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ వైద్య శిబిరాలతోపాటు.. ఆహారం ఇతర సదుపాయాలను కల్పించారు. ఎప్పటికప్పుడు కలెక్టరేట్ నుంచి తుఫాన్ ప్రత్యేకాధికారి చక్రధర్ బాబు సమీక్ష నిర్వహించారు.

- కూలిన విద్యుత్ స్తంభాలు

గాలుల ధాటికి.. జిల్లాలో 55 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతోపాటు 11 ట్రాన్స్‌ఫార్మర్‌లు పాడయ్యాయి. వాటిని యుద్ధప్రాతిపదికన మార్పుచేసి కొన్ని గంటల వ్యవధిలోనే (మిగతా 7వ పేజీలో..)



ఎల్.ఎన్.పేట: వర్షపునీటిలో పొలాల గుండా మృతదేహాన్ని దహన సంస్కారానికి తీసుకెళ్తున్న మిరియాపల్లి గ్రామస్థులు

అంత్యక్రియలకు ఇబ్బందులు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో ఎల్.ఎన్.పేట మండలం మిరియాపల్లిలో ఓ వృద్ధురాలి అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వంశధార నది చెంతన ఉన్న మిరియాపల్లిలో సోమవారం రాత్రి ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఆమెకు వంశధార తీరంలో అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. కాగా వర్షాల కారణంగా వంశధార నదిలో నీటిమట్టం దశలవారీగా పెరిగింది. నది వద్దకు వెళ్లే మార్గం లేకపోవడంతో గ్రామ సమీపంలో తోటలో అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. పంట పొలాల్లో కూడా వర్షపు నీరు చేరడంతో.. మంగళవారం ఇబ్బందులు పడుతూ వృద్ధురాలి మృతదేహాన్ని తోటలోకి తీసుకెళ్లి దహన సంస్కారాలు పూర్తిచేశారు.



ఆమదాలవలస : రైల్వేస్టేషన్‌లో నిలిచిన గూడ్స్ రైళ్లు



శ్రీకాకుళంలో హైవేపై నిలిపేసిన లారీలు, వాహనాలు



కంచిలి : నారాయణబట్టి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

కూలిన ఇళ్లు

రణస్థలం/ కవిటి/ గార/ మెళియాపుట్టి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రణస్థలం మండలం అల్లివలస గ్రామానికి చెందిన గుంటు లక్ష్మీ, వాసపల్లి పోతయ్యకు చెందిన పూరిళ్ల గోడలు కూలిపోయాయి. తిరుపతి పాలేం గ్రామానికి చెందిన దువ్వాన పైడమ్మ పూరిల్లు కూడా కూలిపోయింది. అధికారులు పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. అలాగే కవిటి మండలం జగతి గ్రామంలో పి.మల్లేశ్వరరావుకు చెందిన ఇంటి గోడ కూలిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. గార మండలం రామచంద్రపురం పంచాయతీ జొన్నలపాడులో కలగ సరస్వతి, దుక్క సూరమ్మకు చెందిన రేకుల ఇళ్లు, తోణంగిలో లక్ష్మీకి చెందిన పూరిల్లు నేలమట్టమయ్యాయి. దీంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. అలాగే మెళియాపుట్టి మండలం భరణికోటలో నవర సురేష్‌కు చెందిన మట్టి ఇల్లు పడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



రణస్థలం : అల్లివలసలో కూలిన పూరిల్లు



కవిటి : జగతిలో కూలిన ఇంటి గోడ



మెళియాపుట్టి : భరణికోటలో..



గార : జొన్నలపాడులో..

విపత్తు.. సిక్కోలు వణుకు!

- ఏటా రెండు, మూడు తుఫాన్లు
- నాలుగేళ్లకోసారి తప్పని పెనుముప్పు
- తీర ప్రాంతాల్లో పంటలకు అపార నష్టం

ఇచ్ఛాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్.. ఈ మాట వింటేనే సిక్కోలు వణికిపోతుంది. సువిశాల తీర ప్రాంతం జిల్లాకు వరమో.. శాపమో తెలియడం లేదు. తీరప్రాంత పరిరక్షణ, హార్బర్లు, జెట్టీల నిర్మాణం లేదు. అనుబంధ పరిశ్రమల ఏర్పాటు లేదు. కానీ బంగాళాఖాతానికి ఆనుకుని జిల్లా ఉండడంతో ఏటా రెండు, మూడు తుఫాన్ల ముప్పు తప్పడం లేదు. ప్రతి నాలుగేళ్లకు ఓ పెను విపత్తు ప్రభావం చూపుతూనే ఉంటోంది. 1999లో సూపర్ సైక్లోన్ నుంచి 2018 తితలీ తుఫాన్ వరకూ ప్రతి విపత్తు జిల్లాను కోలుకోలేని దెబ్బతీసింది. ఫైలిన్, లెనిన్, హుద్‌హుద్, తితలీ తుఫాన్లు జిల్లాకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. తాజాగా మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. ఏడేళ్ల కిందట ఉద్దానంలో తితలీ తుఫాన్ సృష్టించిన ప్రళయంతో కొబ్బరి, జీడిచెట్లన్నీ నేలకొరిగాయి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వేళ.. మొంథా తుఫాన్ రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

- జిల్లాలో 11 మండలాల్లో తీర ప్రాంతం 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. తుఫాన్ ప్రభావిత తీర గ్రామాలు 250వరకూ ఉన్నాయి. కాలుష్యం, భూతాపం పెరగడం, వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో భూమిపై ఏర్పడాల్సిన ఉపరితల ఆవర్తనాలు దిశ మార్చుకుంటున్నాయి. సముద్ర మట్టంపై విస్తరించి ఒకేసారి తీరంపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా ఈదురుగాలులు, వర్షాలతో కొబ్బరికి, జీడి మామిడికి నష్టం వాటిల్లుతోంది. అంతర్ పంటగా వేసుకున్న పనస, అరటి, మునగ, కూరగాయలు, ఇతరత్రా పంటలకు నష్టం తప్పడం లేదు. తీర మండలాల పరిధిలో 1.80 లక్షల ఎకరాల వరికి, లక్ష ఎకరాలకుపైగా జీడి, కొబ్బరికి, 20 వేల ఎకరాల్లో సాగవుతున్న పనస, అరటి, ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వీటి (మిగతా 7వ పేజీలో..)



అక్టోబరు అంటేనే హడల్

కవిటి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెల వచ్చిందంటే చాలు ఉద్దానం వాసులు హడలిపోతారు. ఒకప్పుడు ఎటుచూసినా పచ్చని కొబ్బరిచెట్లతో మరో కోనసీమ మాదిరి ఉద్దానం ప్రాంతం కళకళలాడేది. కానీ ఏటా తుఫాన్ల ప్రభావంతో ఆ పచ్చదనం కనుమరుగైపోతోంది. పెను తుఫాన్లు అక్టోబరులో సంభవిస్తుండడంతో.. ఈ నెల ఎప్పుడు పూర్తవుతుందా? అని ఉద్దానం రైతులు క్షణమొక యుగంగా గడుపుతారు. 1999లో ఏర్పడిన తుఫాన్ నుంచి 2018లో వచ్చిన తితలీ వరకు అన్నీ తుఫాన్లు అక్టోబరులోనే ప్రళయం సృష్టించాయి. కొబ్బరి, జీడి పంటలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వేలాది కొబ్బరిచెట్లు నేలకూలాయి. వరిపంట ఈ ఏడాది పోయిందంటే మరో ఏడాది పండించుకునే అవకాశం ఉంటుంది. కానీ కొబ్బరిచెట్లు కూలిపోతే మళ్లీ కొత్తగా చెట్లు కాపునకు రావాలంటే పదేళ్ల వేచిచూడాల్సిందేనని రైతులు వాపోతున్నారు.

ఇవేమి సేవలు?

- కిడ్నీ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది తీరుపై ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు అసహనం
- మూడు గంటల పాటు తనిఖీ

పలాస, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పలాసలో 200 పడకల కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో అన్నీ హంగులు సమకూర్చినా, రోగులకు ఇతర ఆసుపత్రులకు పంపించాల్సిన అవసరం ఎందుకు వస్తోందని జిల్లా ప్రత్యేకాధికారి కేవీఎన్ చక్రధర్‌బాబు వైద్యులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఇవేమి సేవలను మండిపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన కిడ్నీ ఆస్పత్రిని సందర్శించారు. మూడు గంటలపాటు అన్ని విభాగాలనూ పరిశీలించారు. రోగులకు సక్రమంగా సేవలు అందని వైనంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరికరాలు, ఆప రేషన్ థియేటర్లు, సరిపడా సిబ్బంది, వైద్యాధికారులు ఉన్నా.. అనేకమంది రోగులు ఇతర కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రికి ఎందుకు తరలివెళ్లి పోతున్నారని ప్రశ్నించారు. వివిధ పరీక్షలను ప్రైవేటు క్లినిక్‌ల్లో చేయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇది సరికాదన్నారు. ఆస్పత్రిలో రసాయనాలు నిండుకోవడంతో రోగులకు బయట పరీక్షలు చేయాల్సి వస్తోందని వైద్యసిబ్బంది వివరణ ఇచ్చారు. ఆస్పత్రికి తగినంత నిధులున్నా.. ఎందుకు కొనుగోలు చేయలేదని ప్రత్యేకాధికారి ప్రశ్నించగా వైద్యసిబ్బంది నీళ్లు నమిలారు. కొత్తగా విధుల్లో చేరిన సూపరింటెండెంట్ జె.కిషోర్ మాట్లాడుతూ సొంతంగా కొనుగోలు చేస్తామని తెలిపారు. ఆస్పత్రిలో మందుల కొరత, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే తనకు నివేదిక ఇవ్వాలని, దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ప్రత్యేకాధికారి స్పష్టం చేశారు. అనంతరం పౌరసరఫరాల గిడ్డంగి, రేషన్‌డిపోలు, ఎఫ్‌సీ గోదామును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్‌ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎంఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, యవ్వారి మోహనరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త కళ్యాణ్‌బాబు, తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మట్ట రవికృష్ణ పాల్గొన్నారు.



కిడ్నీ ఆస్పత్రిలో వైద్యాధికారులను ప్రశ్నిస్తున్న ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు

మొంథా ముంచేసింది


ఎల్ఎన్‌పేట: నేలకొరిగిన వరి పంటను చూపిస్తున్న రైతు

● జిల్లాలో భారీ వర్షాలు ● నీట మునిగిన పంటలు

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు నీట మునిగాయి. పొలాలు చెరువు లను తలపిస్తున్నాయి. చెరువులు నిండు కుండల్లా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వాగులు, గెడ్డలు పొంగి పొర్లుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం


ఇచ్ఛాపురం: ఇన్నేసుపేటలో నీట మునిగిన పంట పొలాలు


హరిపురం: సునాముది కాలువకు గండి పడిన దృశ్యం


పలాస: సున్నాడ వద్ద కోతకు గురైన రహదారి


జి.సిగడాం: పెంట గ్రామంలో నీట మునిగిన వరి పంట


టెక్కలి రూరల్: విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్‌తో ఎత్తుతున్న సిబ్బంది


నరసన్నపేట: రావాడపేట వద్ద నేలకొరిగిన వరిపైరు


కాశీబుగ్గ: మొగిలిపాడు బ్రిడ్జి వద్ద వరద నీరు


మెళియాపుట్టి: మురిఖిండిబద్ర వద్ద నీటిలో మునిగిన పంటలను చూపిస్తున్న రైతులు


ఇచ్ఛాపురం: ఒడిశాలోని బగలెట్టి డ్యాం నుంచి విడుదలైన నీరు


పలాస రూరల్: కేదారిపురం వద్ద వరహాలగెడ్డ ప్రవాహం


లావేరు: ఎల్ఎన్‌పురంలో నేలమట్టమైన వరి పంట


సరుబుజ్జిలి: షలంత్రి వద్ద గాలులకు నేలకొరిగిన వరి చేలు


మందస: నీరు చేరడంతో దెబ్బతిన్న వరి


జలుమూరు: చల్లవానిపేట ప్రాంతంలో నీట మునిగిన వరిచేను


కోటబొమ్మాళి: ఊడికలపాడు వద్ద నీటిలో ఉన్న వరి చేలు


సోంపేట: పొంగిపొర్లుతున్న చెరువు

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్




విష్ణు విశాల్ కథా నాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సువర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకోని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగరాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

తుఫాన్ తర్వాత సమస్యలు లేకుండా చర్యలు

● జిల్లా ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు



సమీక్షిస్తున్న ప్రత్యేకాధికారి చక్రధర్‌బాబు

అరసవల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తర్వాత సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని తుఫాన్ ప్రత్యేకాధికారి కేవీఎస్.చక్రధర్‌బాబు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వివిధ శాఖల జలవనరులు డ్యామ్‌లు, కాలువల పరిస్థితిపై సమీక్షించారు. తుఫాన్ తర్వాత ప్రజలు తాగే నీటిని క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని ఆదేశించారు. బహుదానది మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు జలవనరులశాఖ ఎస్‌ఈ పి.సుధాకర్ తెలిపారు. వచ్చే వరద ప్రవాహంపై ఆయనను చక్రధర్ బాబు అడిగి తెలుసుకున్నారు. అలాగే మేజర్ ఇరిగేషన్ పరిస్థితిపై ఆరా తీశారు. గొట్టాబ్యారేజ్‌లో నీటి ప్రవాహ పరిస్థితి, నిలువ లపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఎస్‌ఈలు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పోలీసు సేవలు



మత్స్యకారులకు సూచనలిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావి గ్రామాల్లో పోలీసులు మంగళవారం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వర్షాల ప్రభావం వల్ల ప్రాంతాల్లో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని పహారాలను మోహరించి అత్యవసర సేవలను సమన్వయం చేసుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, పునరావాస కేంద్రాల్లో ఉండాలని, ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 112కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని వారు సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో మత్స్యకారులకు వేటకు వెళ్లవద్దన్నారు.

తీర గ్రామాల్లో ఇన్‌చార్జి కలెక్టర్, ఎమ్మెల్యే పర్యటన

గార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం ఉన్న తీరప్రాంత గ్రామాల్లో మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్ పర్యటించారు. బందరు వానిపేట, మొగదాలపాడు తదితర మత్స్యకార గ్రామాల్లో పర్యటించి స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు తప్పనిసరిగా వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అత్యవసర మైతే తప్ప ప్రజలకు ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. ● తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం రాత్రి గారలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం పర్యటించి స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ సీహెచ్.గంగరాజు ఆధ్వర్యంలో ఈ టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నగరంలోని శివారు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాలను ఎమ్మెల్యే గొండు శంకర్.. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావుతో కలిసి మంగళవారం సందర్శించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే తుఫాన్ ప్రభా వంతో కోతకు గురైన శ్రీకాకుళం రూరల్ మండలం పెద్ద గనగళ్లపేట సముద్ర తీరాన్ని మంగళవారం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. అలల తాకిడి పెరగడంతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

తీరప్రాంత గ్రామాల్లో ఎంపీ, ఎమ్మెల్యే..



ఎచ్చెర్ల: డి.మత్స్యలేశం తీరంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

ఎచ్చెర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముంథా తుఫాన్ దృష్ట్యా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మంగళవారం డి.మత్స్యలేశం, కొత్త మత్స్యలేశం, కొత్త దిబ్బల పాలెం, భగీరథపురం, బడివానిపేట, బుడగట్లపాలెం గ్రామాల్లో పర్యటించి స్థానికులను అప్రమత్తం చేశారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. తహసీల్దార్ బి.గోపాల్ మాట్లాడుతూ మండలంలో 11 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, బుడగట్లపాలెం సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, ఎఫ్‌డీవో రవి తదితరులు పాల్గొన్నారు. ● భగీరథపురంలో తుఫాన్ కారణంగా తంగి జయమ్మకు చెందిన ఆవుపై చెట్టు పడడంతో చనిపోయింది. వీరాయవలసకు చెందిన కరణం అచ్చప్పకు చెందిన పూరిల్లు నేల కూలింది.

కొవ్వాడ, అల్లివలసల్లో..

రణస్థలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావ తీరాలైన కొవ్వాడ, అల్లివలస, జీరుపాలేం, కొల్లిభీమవరం, ఎన్‌జీఆర్ పురం తదితర ప్రాంతాలను మంగళవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సందర్శించారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడుతూ.. చేపల వేటకు వెళ్లవద్దని, తుఫాన్ తీవ్రత వల్ల అప్రమత్తంగా ఉండాలని, వలలు, పడవలను ఎత్తైన ప్రదేశాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య భద్రతకు సఖి 'సురక్ష'

అరసవల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతకు 'సఖి సురక్ష' ద్వారా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం కుటుంబానికి, సమాజానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, హెల్త్ అధికారి పి.సుధాకర్, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు బి.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు వాయిదా

గుజరాతీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా పోటీల ఎంపికలు వాయిదా పడినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30నుంచి జరగాల్సిన ఈ క్రీడా ఎంపికలను తదుపరి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని, ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

నీటి ఉధృతితో నిలిచిన రాకపోకలు

జిల్లాలో వరద ఉధృతికి పలు గ్రామాల రహదారులపై నీటి ప్రవాహంతో పలు ప్రాంతాల నుంచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

కంచిలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు సాగునీటి కా లువ నుంచి వరదనీరు సమీప గ్రామాల రహదారులపై ప్రవహిస్తుండడంతో బెల్లుపడా, పోలేరు, డీజీపురం, బైరిపురం, ఘాటీ తదితర పంచాయతీల్లోని పలు గ్రామాలకు సరిహద్దు ఒడిశా నుంచి రాకపోలకు నిలిచిపోయాయి. నారాయణబట్టి గ్రామం వద్ద ఉన్న గోవింద సాగరం నుంచి వరదనీరు రహదారిపైకి చేరింది. దీంతో పాదచారులతోపాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండల ప్రత్యేకాధికారి అప్పలస్వామి, స్థానిక తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో శివరాంప్రసాద్, చిట్టిబాబబు, డీటీ సంతోష్, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలసి గంగాసాగరం రిజర్వాయర్, ముకుందసాగరాలను పరిశీలించారు. మండల శివారులోని గిరిజన గ్రామాల వద్ద ఎటువంటి నివాసం లేని సంచారజీవితం గడుపుతున్న పది బుడజంగమ కుటుంబాలను గుర్తించి, వారిని కుంబరినౌగాం పాఠశాలలో వసతి కల్పించారు. నువాగడకు చెందిన గోమాంగో సీతారాంకు నువ్వాగడ ఆశ్రమపాఠశాలలో వసతి కల్పించారు. రాకాసిగెడ్డ వద్ద నీరు ఉధృతంగా ప్రవహించడంతో కర్తలి,సిర్తలి, ఎంఎస్‌పల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచాయి.



కంచిలి: రాకాసిగడ్డ వద్ద వరద ఉధృతి

బాతుపురం రోడ్డు మూసివేత

సోంపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పైడిగాం ప్రాజెక్టు పరిధిలో ఉన్న అనేక గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొర్లాం నుంచి బాతుపురం వెళ్లే రహదారి పొడువునా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొత్త బాతుపురం, పైడిగాం, బకుడు, జాన్నాసాయి, హంసమేరా, బలిగాం గ్రామాల ప్రజలకు మండల అధికారులు అప్రమత్తం చేశారు. బాతుపురం గ్రామానికి కొద్ది మీటర్ల దూరంలో కాలువ నీరు రోడ్డుపైకి ప్రవ హించడంతో ఆ గ్రామానికి అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ఇక్కడికి సమీపంలో చీకటిగెడ్డ కల్వర్టు వరదనీటిలో కొట్టుకు పోయింది. పునరావాస కేంద్రాల్లో 160 మందికి వసతి, భోజన సదుపాయాలు కల్పించారు.



సోంపేట రూరల్: మూసేసిన బాతుపురం రోడ్డు..

రైల్వే అండర్ టన్నెల్‌లోకి నీరు..

ఆమదాలవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో స్థానిక రైల్వేశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. రైల్వే ట్రాక్‌ను ఆనుకొని ఉన్న కనుగువలస అండర్ టన్నెల్‌లో నీరు చేరడంతో మంగళవారం మూసివేశారు. దీనితో ఆమదాలవలస పట్టణం నుంచి తమ్మయ్యపేట, ముద్దాడపేట, కలివరంతో పాటు తొగరాం గ్రామాలకు రాకపోకలకు స్థానికులు ఇబ్బందులుపడ్డారు. తుఫాన్ నేపథ్యంలో చిగురు వలస గ్రామ పంచాయతీ శ్రీరాంవలస ప్రాంతంలో ఉన్న వాల్మీకి నగర ఎరుకుల కులస్థులకు తహసీల్దార్ ఎల్.మధుసూదనరావు సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.



ఆమదాలవలస: వర్షపు నీటితో నిండిన కనుగులవలస రైల్వే అండర్ టన్నెల్

పద్మాపురం గెడ్డకు భారీ వరద

ఇచ్ఛాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కారణంగా మండలంలోని ఇన్నేసుపేట గ్రామ సమీపంలో పద్మపురం గెడ్డలో భారీ వరద నీరు చేరడంతో గ్రామం జలదిగ్బంధం అయింది. సమీపంలోని పంట పొలాలు నీట మునగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సమీప గ్రామాలైన తులసిగాం, దర్మపురం, కొరారి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తులసిగాం, ఇన్నేసుపేట పరిదిలో సుమారుగా 247 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. ఇదిలా ఉండగా మండలంలోఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తహసీల్దార్ వెంకటరావు, ఎంపీ డీవో ప్రభాకరరావు, సీఐ చిన్నమనాయుడు, ఎస్ఐ ముకుందరావు సందర్శించి వంటలను పరిశీలించారు.

కోతకు గురైన సముద్రతీరం



ఇచ్ఛాపురం: ఇన్నేసుపేట రోడ్డుపై వరదనీరు

కవిటి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాఏక్ష ప్రభావంతో మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు భారీ వర్షం కురిసింది. కొబ్బరి తోటల్లో నీరు చేరింది. తీరప్రాంతాలు అలల ధాటికి కోతకుగురయ్యాయి. అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.

37 మంది గర్భిణులకు ప్రసవాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆ ప్రభావిత ప్రాంతాల్లోని గర్భిణులను వివిధ ఆసుపత్రులకు తరలించినట్లు డీసీహెచ్‌ఎస్ డా.కల్యాణ్‌బాబు తెలిపారు. ఈ మేరకు 37 మంది గర్భిణులకు ప్రసవాలు చేయించామన్నారు. గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు చేసుకుని పండంటి బిడ్డలకు జన్మనిచ్చారని పేర్కొన్నారు. సోమవారం 13, మంగళవారం 24 ప్రసవాలు జరిగాయ న్నారు. ఇదిలా ఉండగా కోటబొమ్మాళి సీహెచ్‌సీలో గుండెపోటుతో వచ్చిన మహిళలకు రూ.40వేల ఇంజక్షన్ ఇచ్చిన అనంతరం అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని ఓ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఏజీపీల నియామకం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, టెక్కలి జూనియర్ సివిల్ కోర్టులకు సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఏజీపీ) నియామకం జరిగింది. కోటబొమ్మాళికి పల్లి వాసుదేవరావు, టెక్కలికి దివ్వల వెంకట వివేకానందలను నియమిస్తూ ప్రభుత్వ న్యాయ శాఖ కార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి నెలకు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనంతో విధుల్లో చేరిన నాటి నుంచి మూడేళ్ల పాటు సేవలందించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంల గోడౌన్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నెలవారీ తనిఖీలో భాగంగా అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్‌తో మంగళవారం పరిశీలించారు. డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.6.60 కోట్లు విడుదల

ఆమదాలవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ. 6.60 కోట్లు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల్లో వంద అభివృద్ధి పనులకు గాను ఉపాధి హామీ పథకం కింద మంజూరయ్యాయన్నారు.

కళాశాలలకు నేడు సెలవు

ఎచ్చెర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు మొంథా తుఫాన్ కారణంగా బుధవారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత 27, 28 తేదీల్లో సెలవులివ్వగా బుధవారం కూడా సెలవు ప్రకటించా మన్నారు. వర్సిటీ, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు గమనించాలన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

రణస్థలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండములగాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త దన్నాన సురేష్ (45) మంగళవారం మృతి చెందాడు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో పిన్నింటి భానోజీ నాయుడు, దన్నాన సత్తిబాబు తదితరులున్నారు.

మత్స్యకారులకు రూ.15 లక్షల నష్టం



నష్టపోయిన చేపలను చూపిస్తున్న మత్స్యకారుడు

ఇచ్ఛాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురియడంతో మత్స్యకార గ్రామ మైన డొంకూరులో 30 టన్నుల మత్స్యసంపదకు నష్టం వాటిల్లింది. ఇసుక దిబ్బలపై ఎండబెట్టిన సుమారు రూ.15 లక్షల విలువైన ఎండు చేపలు తడిచి ముద్దవ డంతో వారంతా లబోదిబోమంటున్నారు. గ్రామంలోని సుమారు 1000 మంది మత్స్యకారుల మత్స్య సంపదకు నష్టం వాటిల్లిందని మండల మత్స్యకార నాయకుడు చీకటి కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు పేర్కొన్నారు. ఈ మేరకు వారు గ్రామాన్ని సందర్శించి బాధిత మత్స్యకారులను పరామర్శించారు.

విపత్తు.. సిక్కోలు వణుకు!

(ఐదో పేజీ తరువాయి)

ఆధారంగా జీవనోపాధి పొందుతున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

● ఆక్రమణలతో మరింతగా..

జిల్లాలో తీర ప్రాంతంలో అటవీ భూములు 14 వేల హెక్టారులు ఉన్నాయి. చిత్తడి నేలలు 8 వేల హెక్టారులు, ఉద్యానవన పరిధిలో వచ్చే జీడి, కొబ్బరి, మామిడి వంటివి 1.20 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. మరో 12 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. అయితే అటవీ శాఖ భూమి పూర్తిగా ఆక్రమణలకు గురవుతోంది. అటు చిత్తడి నేలల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. అటవీ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. 5 వేల ఎకరాలు అక్రమార్కుల బారిన పడి జీడి, కొబ్బరి తోటలు వెలిశాయి. కొన్ని ప్రాంతాల్లో చేపల చెరువులను ఏర్పాటు చేశారు. సరుగుడు, మొగలి, తాటి చెట్లు తీరంలో లేకుండా పోతున్నాయి. దీంతో ఉష్ణతాపంతో అలల తీవ్రత పెరిగి తీరం కోతకు గురవుతోంది. తుఫాన్ల సమయంలో ఈదురుగాలులు నేరుగా తీరానికి తాకి భూభాగంపై వెళుతున్నాయి. అదే సమయంలో వర్ష తీవ్రత ఉంటే కొబ్బరి చెట్లు కూకటివేళ్లతో పెకిలించబడుతున్నాయి. ఉద్దానం గ్రామాలకు అపార నష్టం కలుగుతోంది.

బారువలో ఓపెన్ స్టేడియం నిర్మించాలి



మంత్రి రామ్మోహన్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బారువ బీచ్‌లో ఓపెన్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును టీడీపీ మండల అధ్యక్షుడు మద్దు కుమార్‌తో కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి స్పందిస్తూ స్టేడియం నిర్మాణంతోపాటు, లైటింగ్, మినీపార్కు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పేదలకు అండగా ప్రభుత్వం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. జిల్లాలోని పలు పేద కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శ్రీకాకుళంలోని తన గృహంలో లబ్ధిదారులకు మంగళ వారం అందించారు. ఎచ్చెర్ల మండలం కొండములగాంకి చెందిన జడ్డు కుమార్‌నాయుడుకు రూ.2.60 లక్షలు, కేశవరావుపేటకి చెందిన పైడి కుమార్‌సాయికి రూ.60 వేలు చెక్కులను అందించారు.

ముంచేసిన 'మొంథా'

(ఐదో పేజీ తరువాయి)

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్‌తోపాటుగా 995మంది విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేశారు. మొత్తం విద్యుత్ శాఖకు రూ.6.5లక్షలు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

● నేలకొరిగిన వరి పంట

కొద్దిరోజుల్లో కోతకు వచ్చే వరి పంటకు తుఫాన్ రూపంలో ముప్పు ఏర్పడింది. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, నరసన్నపేట, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో వరి పంట సుమారుగా 1500 హెక్టార్లలో ఒరిగిపోయింది. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. ఏకంగా నీట మునిగి 350 హెక్టార్లలో వరి పంట పాడైంది. నరసన్నపేట, పోలాకి, గార, జలుమూరు ప్రాంతాల్లో పంటలు పాడయ్యాయి. ఉద్దానంలో కొబ్బరి, అరటి పంటలకు తీవ్రనష్టం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో మూగజీవులు మృత్యువాతపడ్డాయి. గురువారం కూడా మరింతగా వర్షం కురుస్తుందని.. అధికారులు హెచ్చరిక జారీచేశారు. మూడోరోజు కూడా కళాశాలలకు సైతం సెలవు ప్రకటించేశారు. అలాగే తుఫాన్ కారణంగా జిల్లా మీదుగా వెళ్లే సుమారు 40 రైళ్లు రద్దవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

● హైవేపై భారీ వాహనాలు నిలుపుదల..

తుఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం రాత్రి గాలులు... వర్షం తీవ్రత పెరిగింది. దీంతో జాతీయ రహదారిపై భారీ వాహనాలను ఎక్కడికక్కడే నిలిపివేయించారు. హైవే పొడవునా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోండి

అరసవల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దాదాపు 21 సంవత్సరాలు సేవలందించిన హెల్త్ అసిస్టెంట్లను తొలగించడంపై వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తులు విచారించి తక్షణం విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం తీర్పును వెలువరించారని ఆ సంఘ నేతలు తెలిపారు. దీంతో హెల్త్ అసిస్టెంట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ జీవోలో ఉన్న వారిని విధుల్లో కొనసాగించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.

సర్వీసులో ఎటువంటి పొరపాట్లు చేయొద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ సర్వీసులో ఎటువంటి పొరపాట్లను చేయవద్దని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మంది రంలో మంగళవారం విజిలెన్స్ ఎవేర్‌నెస్ వీక్ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.రమణ, ఏవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

గుజరాతీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.మహేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ అధికారిక వెబ్‌సైట్‌లో నవంబరు 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.





అంతా జలమయం

బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గంట రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు చోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. వేలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి.

కొట్టుకుపోయిన కల్వర్టు


కల్వర్టు కొట్టుకుపోవడంతో ఇలా..

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెద్దబడాం-నగరంపల్లి మధ్య ఉన్న కల్వర్టు కొట్టుకుపోవడంతో పంటపొలాలు చెరువులను తలపిస్తుంది. పలాస ఆర్డీవో జి.వెంకటేష్ తీరప్రాంత గ్రామాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా నువ్వలరేవులో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సురక్షిత ప్రాంతానికి తరలింపు


పెసరపాడు గ్రామస్థులతో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ 6వవార్డు పెసరపాడుకు వెళ్లే రోడ్డు నర్సీపురం కాలనీకి అనుకొని ఉన్న రోడ్డుపై గుడారాలు వేసుకొని జీవిస్తున్న సంచార జాతులను మునిసిపల్ కమిషనర్ రామారావు సురక్షిత ప్రాంతానికి తరలించారు. తుఫాన్ ప్రభావంతో అక్కడ ఉన్న గుడారాలు నీట మునగడంతో ఖాళీ చేయించి వేరే ప్రాంతానికి తరలించారు. అలాగే పెసరపాడు చెరువు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతవాసులను కమిషనర్ అప్రమత్తం చేశారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మంగళవారం కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ కాలనీ, మండాపొలం కాలనీ, శ్రీనివాస్‌నగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. అలాగే నౌపడా-మెళియాపుట్టి రోడ్డు పాత ఆసుపత్రి రోడ్డులో చెట్టు కూలింది. తొలుసూరుపల్లి రోడ్డులో వర్షపునీరు చేరి వాహన రాకపోకలకు అవస్థలు నెలకొన్నాయి. అలాగే తహసీల్దార్ సత్యం, ఎంపీడీవో రేణుక తదితరులు పలు పల్లపు ప్రాంతాలను పరిశీలించారు.


కిరాణీ షాపులోకి చేరిన నీటిని తొలగిస్తున్న దృశ్యం

షాపుల్లోకి వరదనీరు

నరసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎడతెరపిలేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుందరాపురం, చిక్కాలవలస, మామిడివలస, కంబకాయి, రెల్లివలస, పారశెల్లి తదతర గ్రామాల్లోని తంపర భూముల్లో వందలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. దాదాపు 150 ఎకరాల్లో వరద ముంచెత్తింది. నరసన్నపేట పట్టణంలోని బజారువీధి, బండివీధి తదితర ప్రాంతాల్లో వరదనీరు ప్రవహిస్తుంది. కొత్తబస్టాండ్‌లో గల జయలక్ష్మి కాంప్లెక్స్‌లోని మూడు షాపుల్లో వరదనీరు చేరింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలను కూడా వరద నీరు చుట్టిముట్టింది.

30 గ్రామాలకు నిలిచిన రాకపోకలు


హరిపురం: చీపి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

హరిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వాగులు, వంకలు పొంగి ప్రవస్తుండడంతో మందస మండలంలోని పలు కాలువలు గండ్లు పడి నీరంతా పొలాలపై ప్రవహిస్తోంది. చీపి గెడ్డ, మహేంద్రతనయ నది, సునాముది గెడ్డలు పొంగి ప్రవహస్తున్నాయి. దీంతో పుచ్చపాడు, కృష్ణాపురం, సిరిపురం, చిన్నకోష్ట, కురడాలు, కుంటికోట, సిరిపురం, సవర తులసిగాం, నర్సింగపురం తదితర సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బేతాళపురం వద్ద కూలిన చెట్టును ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తన సిబ్బంది, స్థానిక యువతతో కలసి తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గౌడగురండి వద్ద మహేంద్రతనయ నది కోతకు గురవడంతో ఆ గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో తహసీల్దార్ మిస్కా శ్రీకాంత్, ఎంపీడీవో వెంకటరమణ తదితరులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షభీభత్సానికి మందస మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి, ఇతర పంటకు తీవ్ర నష్టం కలిగింది.

స్వల్పంగా పెరిగిన వంశధార


హిరమండలం: బ్యారేజీ నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

హిరమండలం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గొట్టాబ్యారేజీ వద్ద వంశధార నది నీటి ప్రవాహం మంగళవారం స్వల్పంగా పెరిగింది. క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షాలకు 13,000 క్యూసెక్కులు వస్తుండగా.. 21 గేట్లను కాస్త పైకెత్తి 12,688 క్యూసెక్కులు నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలు మూసివేశారు. ఒడిశా క్యాచ్‌మెంట్ ఏరియాలో మంగళవారం 140 మిల్లీమీటర్ల వర్షంపాతం నమోదైనట్టు డీఈఈ సరస్వతి తెలిపారు.


టెక్కలి: ఎన్టీఆర్ కాలనీలో గుంతల్లో నీరు


పాఠశాల గదిలో చేరిన నీరు

పాఠశాలలోకి వర్షం నీరు

జలుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కరవంజ పంచాయతీ మట్టవానిపేట ప్రాథమిక పాఠశాలలోకి వర్షం నీరు చేరి బెంచీలు, రికార్డులు తడిసిపోయాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పాఠశాల భవనం పైకప్పు కారిపోతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. అలాగే రామయ్య వలస, ఎర్రన్నపేట, గొల్లపేట పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరింది.

కూలిపోయిన బాలికల వసతిగృహ ప్రహరీ

జలుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ వసతి గృహం ప్రహరీ మంగళవారం మధ్యాహ్నం కూలిపోయింది. ఆ సమయానికి పిల్లలు ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మేట్రిన్ మాధవి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో ప్రత్యేకాధికారి అరుంధతీదేవి, తహసీల్దార్ జె.రామారావు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈవో బి.మాధవరావు ఘటనా పరిశీలించారు. వంశధార నది తీర ప్రాంతాలైన శ్రీముఖలింగం, నగిరికటకం, అచ్యుతాపురం, మర్రివలస, కొమనాపల్లి, సురవరం, మాకివలస, తిమడాం, పర్లాం, అందవరం తదితర ప్రాంతాలతో పాటు జలుమూరు, చల్లవానిపేట, కరవంజ, రామయ్యవలస, కూర్మనాథపురం, గుగ్గిలి తదితర లోతట్టు ప్రాంతాల్లో గల వరిచేలు నీటమునిగాయి. అల్లాడ, రామచంద్రాపురం, రాణ, ఎర్రన్నపేట, సంతలబైలి, ఏనేటికొత్తూరు గ్రామాల్లో పండించిన ఆకు కూరలు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి.

అంధకారంలో బర్మాకాలనీ

టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తొలుసూరుపల్లి పంచాయతీ బర్మాకాలనీ టెక్కలి-నౌపడా మెయిన్‌రోడ్డులో వీధిదీపాలు లేక మూడు నెలలుగా అవస్థలు పడతున్నామని స్థానికులు కోరుతున్నారు. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోని పరిస్థితి ఉందని, ఎప్పటికప్పుడు చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నా యని, అయినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగించి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


చీకటిమయంగా మారిన బర్మా కాలనీ


తామరాపల్లి వద్ద జాతీయ రహదారిపై లారీలను నిలిపివేస్తున్న పోలీసులు

ఎక్కడి వాహనాలు అక్కడే

- తుఫాన్ ప్రభావంతో నేటి మధ్యాహ్నం వరకు నిలిపివేత

నరసన్నపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరందాటే సమయంలో బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎన్‌హెచ్-16పై ఒడిచి నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాదు వెళ్లే వాహనాలను ఎక్కడక్కడే సర్వీసు రోడ్డులో పోలీసులు నిలుపుదల చేశారు. తుఫాన్ ప్రభావంతో విశాఖ- రాజమండ్రి మధ్య జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు బుధవారం మధ్యాహ్నం వరకు నిలిపేవేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు సీఐ ఎం.శ్రీనివాసరావు, నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్, జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. మండలంలో తామరాపల్లి, మడపాం టోల్‌ప్లాజా తదితర ప్రాంతాల్లో గల లారీ పార్కింగ్ ప్రాంతాలకు వాహనాలను తరలించామన్నారు.


పలాస: రాజగోపాలపురం రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

రహదారులపై వరదనీరు

పలాస, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. రెండు అడుగుల మేర నీరు ప్రవహించడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో నెమలికొండ వాగు ప్రాంతంలో ఆక్రమణల కారణంగా రోడ్లపై నీరు నిల్వ ఉండిపోయింది. మునిసిపల్ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. మొగిలిపాడు, తాళభద్ర, కంబిరింగాం రోడ్డు, చాకలిచెరువు వద్ద రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహిస్తుంది.

అప్రమత్తంగా ఉండాలి: ఎంజీఆర్


ఆర్‌ఎల్ పురంలో పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు తదితరులు

పాతపట్నం/రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తుఫాన్ నేపథ్యంలో అత్తిసూరికవిటి, చాకిపల్లి, రైతులక్ష్మీపురం, రొమదళ, రొంపివలస తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని సదుపాయాలని కల్పించాలని ఆదేశించారు. తహసీల్దార్ నందిగాం ప్రసారావు, ఎంపీడీవో హెచ్.వెంకటరమణ, వ్యవసాయాధికారి సింహచలం, టీడీపీ నాయకులు తదితరులు ఉన్నారు. వరద ఉధృతికి కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

తీరం దాటేవరకు జాగ్రత్తగా ఉండాలి


ఎల్ఎన్ పేట: సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

ఎల్ఎన్ పేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరం దాటేవరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావు ఆదేశించారు. వంశధార నదీతీర ప్రాంతాల్లోని సచివాలయాను మంగళవారం ఆయన పరిశీలించారు. తురకపేట, క్రిష్టాపురం సచివాలయాల్లో సిబ్బందితో సమీక్షించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి కిరణ్‌వాణి, పంచాయతీ కార్యదర్శి జి.తవిటినాయుడు, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే కోవిలాం ఎస్సీ కాలనీకి చెందిన ఆరు కుటుంబాలను గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో అధికారులు పునరావాస సౌకర్యాన్ని కల్పించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వారి ఇళ్లు ప్రమాదకరంగా ఉండడంతో అధికారులు మందస్తు చర్యలు తీసుకున్నారు.

- మెళియాపుట్టి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు లోతట్టు గ్రామాల ప్రజలకు సూచించారు. మంగళవారం గోకర్ణపురం, రట్టిణి గ్రామాలకు ఎంపీడీవో ప్రసాద్‌పండా, డీటీ రాము, తదితరులు పరిశీలించారు.
- పలాస రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అల్లుకోల, కంబిరిగాం, బ్రాహ్మణతర్లా, కేదారిపురం వద్ద వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. బుధవారం నాటికి కూడా ఈ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఎస్.కల్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి రవికృష్ణతో పాటు ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పర్యటించారు.


భవానీ మాల ధరించిన రోజే..

- విద్యుదాఘాతంతో వీఆర్ఏ మృతి


నర్సింహులు (ఫైల్)


ఎచ్చెర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు వీఆర్ఏ బొంతల నర్సింహులు(45) విద్యుదాఘాతంతో మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నర్సింహులు సోమవారం రాత్రి తుఫాన్ విధుల్లో ఉన్నాడు. మంగళవారం ఉదయం భవానీమాల ధరించి గ్రామంలోని సన్నిధానం వద్దకు వెళ్లారు. అక్కడ గేటును తాకాడు.. అయితే ఆ గేటుకు విద్యుత్ వైరు ఉండడంతో విద్యు దాఘాతానికి గురయ్యారు. వెంటనే తోటి భవానీ భక్తులు రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భవానీ మాల దరించిన రోజునే ఈ ఘటన జరగడంతో కుటుంబ సభ్యులు ఆవేదనకు గురయ్యారు. నర్సింహులకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్ఏ మృతిపై తహసీల్దార్ బి.గోపాల్, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

గుల్లవానిపేటలో ఒకరు..


రామచంద్రరావు (ఫైల్)

పోలాకి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యాదాఘాతంలో గుల్లవానిపేట గ్రామానికి చెందిన కారి రామచంద్రరావు (41) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దీపావళి పండగ సందర్భంగా తన ఇంటిపై ఏర్పాటు చేసిన సీరియల్ సెట్ లైట్లను తొలగించేందుకు మంగళవారం మేడపైకి వెళ్లాడు. వాటిని తొలగిస్తున్న క్రమంలో పక్క నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లకు తగిలి విద్యాదాఘాతానికి గురయ్యాడు. గాయపడిన రామచంద్రరావును భార్య మమత గ్రామస్థుల సాయంతో 108 వాహనంలో నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామచంద్రరావుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు


సర్వీసు రోడ్డులో బోల్తాపడిన లారీ

హరిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బాలిగాం జాతీయ రహదారిపై బుధవారం ఇచ్ఛాపురం వెళ్తున్న లారీ బోల్తా పడడంతో డ్రైవర్ రాజుకు, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. బాలిగాం బ్రిడ్జి సమీపంలో ఒక లారీకి ఓవర్ టేక్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొనడంతో రోడ్డు పక్కన అమర్చిన సేఫ్టీ మెటల్ రెయిలింగ్‌ను ఢీకొట్టి సర్వీసు రోడ్డుపై బోల్తాపడింది. గాయపడిన వీరిద్దరి చికిత్స నిమిత్తం హరిపురం ప్రభుత్వాసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ కేసు నమోదు చేశారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

కొత్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మదనాపురం పంచాయతీ ఆర్‌కే పురంలో రేకుల ఇళ్లలో నివాసం ఉంటున్న సుమారు 40 కుటుంబాలకు చెందిన సుమారు 120 మందిని, కురిగాంలో మూడు కుటంబాలకు చెందిన 12 మందిని ఆయా గ్రామాల్లోని పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించినట్టు నోడల్ అధికారి, జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ తెలి పారు. భోజనం, తాగునీరు ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తహసీల్దార్ కె.బాలకృష్ణ, ఎంపీడీవో బి.రాం ప్రసాద్, సీఐ సీహెచ్ ప్రసాద్ తదితరు ఉన్నారు. అలాగే దిమిలి పంచాయతీ ఎర్ర టిగూడ రహదారిలో రక్షిత నీటి పథకం ట్యాంకుపై చెట్టు కూలి పాక్షికంగా దెబ్బతింది.

- హిరమండలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎం.అవలంగి పంచాయతీ బొమ్మికగూడ గిరిజన గ్రామానికి చెందిన 11కుంటుంబాలను మంగళవారం రాత్రి సు రక్షిత ప్రాంతానికి తరలించారు. కొండమీద ఉన్న ఈ గ్రామంలో గిరిజన కుటుంబాలు పూరె గుడెసలు, రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా తరలించినట్టు టీడీపీ మండల అధ్య క్షడు దారపు ఢిల్లేశ్వరరావు చెప్పారు. 30 మందిని తరలించామన్నారు.
- జలుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట ఈశ్వరప్ప కోనేరు గట్టుపై రేకులషెడ్‌ల్లో నివాసముంటున్న 15 కుటుంబాలకు చెందిన 45 మందికి చల్లవానిపేట ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించినట్లు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. ఈశ్వరప్ప కోనేరు గట్టుపై రేకుల షెడ్‌ల్లో నివాసముంటున్న కుటుంబాల వద్దకు మంగళవారం ఆయన వెళ్లి వారితో మాట్లాడి చల్లవానిపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.


కొత్తూరు: ఆర్‌కే పురం గ్రామస్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ


హిరమండలం: పునరావాస కేంద్రంలో బొమ్మికగూడ గ్రామస్థులు

వ్యక్తిపై కేసు నమోదు

మెళియాపుట్టి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వసుంధర ఎంపీటీసీ సభ్యులు (వైసీపీ) సలాన చిట్టిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం కొసమాల సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా.. మద్యం తాగి వాహనంపై వస్తున్న చిట్టిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

నిర్బంధించాలనుకోవడం తగదు

పలాసరూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సరిబుజ్జిలి మండలంలో తలపెట్టిన థర్మల్‌పవర్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరే కంగా ఆదివాసీలు చేపట్టిన ఉద్యమాన్ని అనచివేయాలనుకోవడం తగదని ప్రజాసంఘాలు ప్రతినిధులు అన్నారు. బొడ్డపాడు గ్రామం అమర వీరుల స్మారక మందిరంలో ప్రజాసంఘాల నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. వివిధ సంఘాల ప్రతినిధులు పత్రి దానేసు, శాలిన వీరాస్వామి, తామాడ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో మాక్‌డ్రిల్

సంతబొమ్మాళి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తీరగ్రామాల్లో భావనపాడు మెరైన్ పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సి జాగ్రత్తలపై వివరించారు. మెరైన్ సీఐ రాము ఎస్.ఐలు శ్రీనివాస్, మన్మథరావు, కార్యదర్శి రాజు, వీర్వోవో ఉమాపతి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందించాలి

సంతబొమ్మాళి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు నిత్యావసర సరుకులు అందించాలని జిల్లా తెలుగుయువత కార్యదర్శి సూరాడ దాసురాజు, కోటబొమ్మాళి ఏఎంసీ డైరెక్టర్ సూరాడ ధనరాజ్ కోరారు. తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా మత్స్యకారులు వేటకు వెళ్లడం లేదని, మరో నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని, అందువల్ల నిత్యావసర సరుకులు ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

మెళియాపుట్టి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రైతులు ఆదుకోవాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం ఎంపీపీ రాన ఈశ్వరామ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో ప్రసాద్‌పండా తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీగా వివేకానంద



టెక్కలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి కోర్టు ఏజీపీగా స్థానిక బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది దివ్వల వివేకానందను నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. పలువురు అభినందనలు తెలిపారు.

వృద్ధురాలి మెడపై కత్తిపెట్టి

- బంగారు అభరణాల అపహరణ


చికిత్స పొందుతున్న నిక్కు చెల్లెమ్మ

జలుమూరు (సారవకోట), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఇంటిలో చొరబడి వృద్ధురాలి మెడపై కత్తిపెట్టి చెవులోను, ముక్కుకి ఉన్న బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తి అపహరించారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం బుడితి పెద్దవీధికి చెందిన నిక్కు చెల్లెమ్మ(80) ఇంటిలో నిద్రిస్తుండగా సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలో చొరబడి మెడపై కత్తిపెట్టి బెదిరించి ముక్కు, చెవుల్లో ఉన్న అర తులం బంగారం ఆభరణాలు అపహరించుకుపోయాడు. ఈ క్రమంలో ఆమెకు మెడపై కత్తిగాటు పడ్డాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. గాయపడిన చెల్లెమ్మను బుడితి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించినట్టు ఆయన తెలిపారు.

11 కిలోల గంజాయితో మహిళ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

పలాస, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వద్ద అనుమానాస్ప దంగా తిరుగు తున్న ఓ మహిళ నుంచి 11 కిలోల గంజాయిని ఆర్పీఎఫ్, రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం రైల్వే పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు ఇందుకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ మాల్యాద్రి, తన సిబ్బందితో రైల్వేప్లాట్ ఫారంపై తనిఖీ చేస్తుండగా ఓ మహిళ ట్రాలీబ్యాగుతో అనుమాన స్పదంగా కనిపించింది. ఆమెను ప్రశ్నించడంతో గంజాయి విషయం బయట ప డింది. గజపతి జిల్లా గులబ గ్రామానికి చెందిన మిక్కి కుమారి మల్లిక్ ఒడిశా లో కునుహు అనే వ్యక్తి నుంచి గంజాయి సేకరించింది. విజయవాడ మీదుగా ముంబాయికి తరలించేందుకు రూ.10వేలు ఇస్తామని చెప్పడంతో ఆమె రవాణా చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో పోలీసులకు దొరికిపోయింది. దీంతో ఆమె ను విశాఖ రైల్వేకోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రెండు గొర్రెలు మృత్యువాత

పలాస రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు బొడ్డపాడు గ్రామం కిక్కర అప్పలస్వామికి చెందిన రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. భారీ వర్షాలు కురవడంతో తోటల్లో ఉన్న గొర్రెలు చలికి గురై మృత్యువాతకు గురైంది. కాగా విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి చైతన్య, వీఆర్‌వో సంతోష్ బాధిత రైతును కలిసి వివరాలు సేకరించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ.20వేలు ఉంటుందని అంచనా.